

గుంటపల్లిలో హెచ్ఐవీపై అవగాహన

విశాలాంధ్ర - పాయకరావుపేట: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ, చైల్డ్ ఫండ్ ఇండియా లింక్ వర్కర్ స్కీం ఆధ్వర్యంలో మండలంలోని గుంటపల్లి గ్రామంలో హెచ్ఐవీపై అవగాహన స్టాల్ యాక్టివిటీ ప్రోగ్రాం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జోనల్ సూపర్వైజర్ డి. రమణ, లింక్ వర్కర్ జి.సిహెచ్. నర్సింగరావు పాల్గొని హెచ్ఐవి, సుఖ వ్యాధుల గురించి ఐఇసి మెటీరియల్ ద్వారా గ్రామస్తులకు అవగాహన కలిగించారు.

ఉపాధి హామీ తనిఖీల్లో

- రూ.9.55 లక్షల రికవరీ

కొండను తవ్వి ఎలుకను పట్టారు..?

విశాలాంధ్ర - పాయకరావుపేట: కొండను తవ్వి ఎలకను పట్టినట్టు చందంగా ఉంది జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం అమలు చేసే అధికారుల పనితీరు. పాయకరావుపేట మండలంలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద గత ఏడాది ఏప్రిల్ 1వ తేదీ నుంచి ఈ ఏడాది మార్చి 31వ తేదీ వరకు రూ.8.23 కోట్లతో 1254 పనులు చేశారు. ఈ పనులకు సంబంధించి గ్రామాల్లో బృందాలు సామాజిక తనిఖీలు నిర్వహించారు. తనిఖీలలో బృందాలు పథకం అమల్లో తప్పులు జరిగినట్లుగా గుర్తించారు. తప్పులు జరిగిన విషయాన్ని ఆయా గ్రామాల గ్రామసభలో చదివి వినిపించారు. చేసిన పనులు కనిపించకపోవడం, ఒకరికి చెందిన కూలీలు వేరొకరికి అకౌంట్లో వేయడం, పని చేయకుండానే పని చేసినట్లుగా డబ్బులు డ్రా చేయడం, కొలతల్లో తేడాలు, ఇళ్ల స్థలం లేకుండానే హౌసింగ్ స్కీం నిధులు డ్రా చేయడం తదితర తప్పులు జరిగినట్లుగా తనిఖీ బృందాలు గుర్తించారు. ఇందులో ఈదటం గ్రామంలో రూ.36.16 లక్షలు తేడాలు ఉన్నట్లు గుర్తించి గ్రామసభలో వెల్లడించారు. నామవరం గ్రామంలో రూ.21.70 లక్షలు తేడాలు జరిగినట్లు గుర్తించి గ్రామ సభలో వెల్లడించారు. అలాగే పలు గ్రామాల్లో ఉపాధి హామీ పథకం అమలులో జరిగిన తప్పులను ఆయా గ్రామసభల్లో వెల్లడించారు. వీటన్నిటిని తీసుకొచ్చి మండల స్థాయిలో జరిగిన ప్రజా వేదికలో సామాజిక తనిఖీ బృందాలు డ్వామా పీడీ సాక్షిగా చదివి వినిపించారు. దీనిపై ఆయా గ్రామాల తెలుగుదేశం పార్టీ నాయకులు అధికారులను నిలదీశారు. తప్పులు చేస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్లను, సీనియర్ మేట్లను తొలగించాలని డిమాండ్ చేశారు. ఇదిలా ఉంటే మండలంలో జరిగిన ఉపాధి హామీ పనులకు సంబంధించి జరిగిన తనిఖీల్లో మండలం మొత్తం మీద 9 లక్షల 55 వేల 380 రూపాయలు తేడాలు ఉన్నట్లు గ్రహించి ఆయా గ్రామాల ఫీల్డ్ అసిస్టెంట్లు, సీనియర్ మేట్లకు రికవరీలు రాశారు. ఇందులో నామవరం ఫీల్డ్ అసిస్టెంట్ సీతారామస్వామికి 4 లక్షల 89 వేల 17 రూపాయలు, ఈదటం ఫీల్డ్ అసిస్టెంట్ సోమయ్యకు 3 లక్షల 6 వేల 724 రూపాయలు అధికారులు రికవరీ రాశారు. అలాగే గోపాలపట్నం సీనియర్ మేట్ త్రినాథ్ కు 23,205 రూపాయలు, శ్రీరాంపురం ఫీల్డ్ అసిస్టెంట్ శ్రీనివాస్‌కు 54,515 రూపాయలు, పెదరాంబద్రపురం సీనియర్ మేట్ పుష్పలతకు 37,112 రూపాయలు, పాల్మాన్ పేట సాయి అనే వ్యక్తికి 28,293 రూపాయలు తదితర రికవరీలు రాసినట్లు అధికారులు వెల్లడించారు. గ్రామ సభల్లో లక్షల రూపాయల్లో తేడాలు ఉన్నట్లు గమనించిన తనిఖీ బృందాలు, రికవరీలు సమయానికి తేడాలు తగ్గినట్లు చూపించటం ఏమిటని ఆయా గ్రామాల టీడీపీ నాయకులు ప్రశ్నిస్తున్నారు. గ్రామాల్లో ఉపాధి హామీ పథకం అమలులో తప్పులు చేసే వారికి అధికారులు వత్తాసు పలుకుతున్నారంటూ ఆరోపిస్తున్నారు.

11న సీఎం చంద్రబాబు పర్యటన

హోం మంత్రి వంగలపూడి అనిత

విశాలాంధ్ర బ్యూరో - అనకాపల్లి: ఈ నెల 11వ తేదీన ఉమ్మడి విశాఖ జిల్లాలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పర్యటించనున్నట్లు హోంమంత్రి వంగలపూడి అనిత తెలిపారు. మంగళవారం ఉదయం స్థానిక కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో జిల్లా అధికారులతో ఏర్పాటు చేసిన సమీక్ష సమావేశంలో ఆమె మాట్లాడుతూ రాష్ట్రంలో నూతనంగా ప్రభుత్వం ఏర్పడిన తదుపరి ఉమ్మడి విశాఖ జిల్లాకు మొదటిసారిగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈనెల 11వ తేదీన విచ్చేస్తున్నారని తెలిపారు. పోలవరం లెఫ్ట్ మెయిన్ కెనాల్ పనులను ముఖ్యమంత్రి సందర్శిస్తారని తెలిపారు. హెలిప్యాడ్ ఏర్పాటు, ముఖ్యమంత్రి ప్రయాణించే మార్గంలో బందోబస్తు తదితర ఏర్పాట్లు గురించి చర్చించారు. అదేవిధంగా పోలవరం లెఫ్ట్ మెయిన్ కెనాల్ పనులకు సంబంధించిన వివరాలను ఇరిగేషన్ శాఖ అధికారులను అడిగి తెలుసుకున్నారు. పర్యటన ఏర్పాట్లలో ఎటువంటి లోటుపాట్లు రాకుండా చూడాలని జిల్లా అధికారులను హోంమంత్రి ఆదేశించారు. ఈ సమీక్ష సమావేశంలో జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్, సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ కె.వి.మురళీకృష్ణ, ఎలమంచిలి శాసనసభ్యులు సుందరపు విజయ్ కుమార్, అసిస్టెంట్ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ విజయ భాస్కర్, అనకాపల్లి ఆర్డీవో చిన్నికృష్ణ, నర్సీపట్నం ఆర్డీవో జయరాం, అనకాపల్లి మాజీ శాసనసభ్యులు పీలా గోవిందు సత్యనారాయణ, మాజీ ఎమ్మెల్సీ బుద్ద నాగ జగదీశ్వర్ రావు, ఇరిగేషన్, రోడ్ల , భవనాలు, రెవెన్యూ శాఖల ఉన్నతాధికారులు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

జ్వరపీడితులకు వైద్య సేవలందించాలి

విశాలాంధ్ర - దేవరాపల్లి: మండలంలో గరిసింగి, వాలాబు, చింతలపూడి, తామరబ్బ పంచాయతీలోని గిరిజన గ్రామాల్లో విస్తృతంగా జ్వరాలు వ్యాప్తిస్తున్నాయని సీపీఎం పార్టీ మండల కార్యదర్శి బి.టి.దొర పేర్కొన్నారు. మంగళవారం గరిసింగి పంచాయతీలో జ్వరాలతో బాధపడుతున్న జ్వరపీడితులను పరామర్శించి మాట్లాడారు. మలేరియా జ్వరాలు వచ్చి ప్రభుత్వ హాస్పిటల్లో చూపించుకున్నా సరైన వైద్యం చేయటం లేదని గరిసింగి పంచాయతీ తాటిపూడి గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారని తెలిపారు. వెంటనే ప్రభుత్వ వైద్య అధికారులు స్పందించి గ్రామస్థాయిలో ప్రభుత్వ వైద్యం సేవలు అందించాలని కోరారు. జన్ని గంగం దొర వయసు (47), జన్ని సామలమ్మ వయసు (40), సంతోష్ (26), మజ్జి హారిక (7), జన్ని దివ్య (10), జన్ని దేముదు (35)లు జ్వరాలతో బాధపడుతున్నారని వెంటనే మెడికల్ క్యాంపుల పెట్టాలని కోరారు.

నేడు ఆర్.ఈ.సి.ఎస్ పాలిటెక్నిక్‌లో అడ్మిషన్ కౌన్సిలింగ్

విశాలాంధ్ర - కశింకోట: స్థానిక రాజీవ్ గాంధీ ఆర్.ఈ.సి.ఎస్ పాలిటెక్నిక్‌లో 50 శాతం అడ్మి షన్లకు బుధవారం కౌన్సెలింగ్ జరుగుతుందని కళాశాల ప్రిన్సిపాల్ కె.శివ తెలిపారు. ఆర్ఈసిఎస్ పాలిటెక్నిక్‌లో అడ్మిషన్ కొరకు దరఖాస్తు సమర్పించినవారు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లు, రెండు జతల జిరాక్స్ కాపీలతో బుధవారం ఉదయం 9.30 గంటలకు కౌన్సిలింగ్‌కు హాజరవ్వాలని తెలిపారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కళాశాలలో 4 బ్రాంచి లు మెకానికల్, ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్, సివిల్స్ ఉన్నాయని ఒక్కో దానిలో 30 సీట్లు చొప్పున వుంటాయని తెలిపారు. ఈ కౌన్సిలింగ్‌కు పర్యవేక్షణ అధికారిగా ప్రభుత్వ పాలిటెక్నిక్, సాంకేతిక విద్యా శాఖ కమిషనర్ వారు నియమించారని అని తెలియజేశారు. కావున ఆసక్తి గల వారు 9063297220, 08924 220377, 9505504220 సంప్రదించాలన్నారు.

పశుగ్రాస వారోత్సవాలు

విశాలాంధ్ర - గొలుగొండ: ఈనెల 7 నుండి 14వ తేదీ వరకు పశుగ్రాసాల వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు కృష్ణదేవి పేట పశువుల వైద్యాధికారి శిరీష అన్నారు. మంగళవారం ఆర్ఎస్‌కె పరిధిలోని పశుగ్రాసాల సాగు భూములను డాక్టర్ శిరీష సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నాణ్యమైన పశు గ్రాసాల వలన పశువులకు అన్ని రకాల పోషకాలు అంది ఆరోగ్యంగా ఎదుగుతాయన్నారు. తద్వారా రైతులకు అధిక పాల దిగుబడి వస్తుందన్నారు. ప్రభుత్వం అందించే పశుగ్రాస విత్తనాలు 75% సబ్సిడీతో రైతు భరోసా కేంద్రాల్లో అందుబాటులో ఉన్నాయని వీటిని పాడి రైతులందరూ వినియోగించుకోవాలని అన్నారు.

ఘనంగా తాళ్లమ్మ తల్లి ఉత్సవాలు

విశాలాంధ్ర - ఎలమంచిలి: పురుషోత్తపురం గ్రామదేవత తాళ్లమ్మ తల్లి ఉత్సవాలను సోమవారం గ్రామ ప్రజలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి భక్తులు పసుపు, కుంకుమ సమర్పించి మొక్కు చెల్లించుకున్నారు. ఉదయం నుంచే అమ్మవారిని దర్శించుకు నేందుకు భక్తులు బారులు తీరారు. ఎలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్ అమ్మవారిని భక్తిశ్రద్ధలతో పూజించి అమ్మవారి ఆశీస్సులు పొందారు. మండల టీడీపీ నాయకులు కె.విజయబాబు ఆధ్వర్యంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.



వరాహ అవతారంలో జగన్నాథుడు

విశాలాంధ్ర - వి.మాడుగుల: మాడుగులలో జగన్నాథ స్వామి ఉత్సవాలలో భాగంగా స్వామివారు మంగళవారం మూడవరోజు వరహావతారంలో ఇంద్రజుమ్నం వద్ద దర్శనమిచ్చారు. ఆలయ పూజారి పండా నూకరాజు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. జగన్నాథ స్వామి రధయాత్ర ప్రారంభం కావడంతో మంగళవారం ఉదయం నుండి వర్షాలు పడటం విశేషం.

సీఎం పర్యటన ఏర్పాట్లను అనిత పరిశీలన

విశాలాంధ్ర - యస్.రాయవరం: ఈనెల 11వ తేదీన ఎస్.రాయవరం మండలం దార్లపూడి గ్రామంలో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పర్యటనకు వస్తున్నట్లు రాష్ట్ర హోం శాఖ మంత్రి వంగలపూడి అనిత వెల్లడించారు. ఇందులో భాగంగా పోలవరం ప్రాజెక్టు నిర్మాణంలో దార్లపూడి గ్రామం సమీపంలో వరహా నది వద్ద ఎడమ కాలువ అక్విడెట్ పనులను ఆమె పరిశీ లించారు. గతంలో సిఎంగా చంద్రబాబునాయుడు ఉన్న సమయంలో చేసిన నిర్మాణం తప్ప మరల పనులు చేయలేదని అన్నారు. అందులో భాగంగా ముఖ్యమంత్రి వస్తున్నారని అన్నారు. ఈ ఏర్పాట్లుకు సంబంధించి జిల్లా కలెక్టర్ విజయ కృషన్, ఎస్పీ మురళీకృష్ణ పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. అడ్డరోడ్డు నుంచి వచ్చే రోడ్డు తక్షణమే మరమ్మతులు చేపట్టాలని అధికారులను మంత్రి ఆదేశించారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో హెలీప్యాడ్ స్థలం పరిశీలించారు. ఈ కార్యక్రమంలో నర్సీపట్నం ఆర్డీవో జయరాం, డీఎస్పీ మెహన్, టిడిపి జిల్లా అధ్యక్షులు బత్తుల తతయ్య బాబు, యలమంచిలి టిడిపి ఇన్‌చార్జ్ ప్రగడ నాగేశ్వరరావు, జిల్లా టిడిపి ప్రదాన కార్యదర్శి లాలం కాశీ నాయుడు, మాజీ ఎంపీపీ వై.వినోద్ రాజు, మండల టిడిపి అధ్యక్షులు అమలకంటి అబద్ధం, టిడిపి సీని యర్ నాయకులు నల్లపరాజు వెంకటరాజు, కందుల వెంకటేశ్వరరావు, తుమ్మపాల నాగేశ్వరరావు, గుర్రం రామకృష్ణ, పల్లెల బుజ్జి, అల్లు నరసింహమూర్తి,అధికారులు తదితరులు పాల్గొన్నారు.

బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి కోసమే జీవో నెం.43

మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ

విశాలాంధ్ర బ్యూరో - అనకాపల్లి: పేదల సొంత ఇంటి కల నెరవేర్చేందుకే ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఉచిత ఇసుక పథకాన్ని తీసుకువచ్చారని మాజీ శాసనసభ్యులు నియోజకవర్గ టీడీపీ ఇన్‌ఛార్జి పీలా గోవింద సత్యనారాయణ అన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో మంగళవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎన్నికలలో ఇచ్చిన ఉచిత ఇసుక హామీను నెల రోజులలోనే నేరవేరుస్తున్న ఘనత కూటమి ప్రభుత్వానికే దక్కుతుందని అన్నారు. వైసీపీ పాలనలో జగన్ రెడ్డి అండ్ కో 50వేల కోట్ల రూపాయల ఇసుకను దోచుకున్నారు అని ఆరోపించారు. పారదర్శకత, ముందు చూపుతోనే తమ ప్రభుత్వం ఇసుక పాలసీని రూపొందించందని అన్నారు. పేదల గృహ నిర్మాణం పేరుతో రాష్ట్రంలోని వైసీపీ నేతలు 98 లక్షల మెట్రిక్ టన్నుల ఇసుకను దోచేసారని ఆరోపించారు. వైసీపీ నాయకులు దోచేసిన ఇసుక డబ్బుతో 10 లక్షల మంది పేదలకు గృహాలు కట్టొచ్చని అన్నారు. గత వైసీపీ ప్రభుత్వం మాదిరి కాకుండా సుప్రీం కోర్టు, ఎన్జీటీ నిబంధనలకు అనుగుణంగా పర్యావరణ పరిరక్షణ దెబ్బతినకుండా ఉచిత ఇసుక అందిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు రాష్ట్ర బీసీ సాధికార కన్వీనర్ మళ్ళ సురేంద్ర, రాష్ట్ర తెలుగు రైతు అధికార ప్రతినిధి గొంతిన శ్రీనివాసరావు, టీడీపీ అర్బన్ జిల్లా ఉపాధ్యక్షుడు బి.జోగి నాయుడు, అర్బన్ జిల్లా కార్యదర్శి పోలారపు త్రినాథ్, ఎంపీటీసీ నారాపిన్ని చంద్ర శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి కూలీల సమస్యలు పరిష్కరించాలి

విశాలాంధ్ర - యమంచిలి: ములకలాపల్లి గ్రామంలో సీఐటీయూ బృందం సోమవారం పర్యటించింది. ఈ సందర్భంగా ఉపాధి కూలీల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వ్యవసాయ కూలీలు తమ సమస్యలను తెలియజేశారు. ఇప్పటికే 9 వారాలు పేమెంట్ బకాయిలు ఉండడంతోపాటు గతంలో మాదిరి సమ్మర్ అలవెన్సు, పరికరాలకు డబ్బులు ఇచ్చేవారని ఇప్పుడు పూర్తిగా రద్దు చేశారన్నారు. ఈ సందర్భంగా సీఐటీయూ నాయకులు శివాజీ, ఏపీ రైతు కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు ఎం.సత్యనారాయణ మాట్లాడుతూ ఉపాధి కూలీల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని, సకాలంలో వారికి చెల్లించాల్సిన బకాయిలు పూర్తిగా చెల్లిం చడంతోపాటు పూర్తిస్థాయి సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో సచివాలయాలు ఎండి ఆఫీస్ ముట్టడి కార్యక్రమం చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో ములకలాపల్లి గ్రామస్తులు, ఉపాధి కూలీలు పాల్గొన్నారు.

ఏపీటీఎఫ్ సభ్యత్వ నమోదు

విశాలాంధ్ర - నక్కపల్లి: మండలంలో మంగళవారం నక్కపల్లి మండల శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన సభ్యత్వ నమోదు కార్యక్రమంలో భాగంగా వివిధ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలు, కెజిబివి స్కూలును సందర్శించారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఉపాధ్యాయ సమస్యలు జీవో నెం 117 రద్దు చేయాలని, సిపియస్ రద్దు చేయాలని, అమ్మకు వందనం ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులకు మాత్రమే వర్తింపచేయాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర పూర్వ కార్యదర్శి బి.వెంకటపతిరాజు (వేణు) డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కౌన్సిలర్ డి.కొండలరావు, జిల్లా అడిట్ కమిటి సభ్యులు బి.శ్రీనివాసరావు, ఎపిటిఎఫ్ పూర్వ గౌరవ అధ్యక్షులు బి.సింహాచలం, ఎపిటిఎఫ్ నక్కపల్లి బాధ్యులు వై.కృష్ణ, సిహెచ్ అప్పలరాజు, ఎ.యేసుదేవుడు, కె.సూర్యారావు, కిల్లాడ శ్రీనివాసరావు, కె.నాగేశ్వరరావు, కె.రంగబాబు, పి.వెంకటరావు, కె.రాజేష్, ఎవివి రమణ, యం.కిరణ్ కుమార్, సిహెచ్ సతీష్, యస్.శ్రీను, కె.జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ మస్తర్లులో దిద్దుబాటు

విశాలాంధ్ర - కె.కోటపాడు: మహత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం అమలులో భాగంగా 16వ విడత సామాజిక తనిఖీ మంగళవారం కే.కోటపాడులో జరిగింది. మండలంలో ఉన్న గ్రామ పంచాయతీలకు సంబంధించి ఇ.జి.యస్ వేతనరూపంలో 14,16,53,394/- ఖర్చు చేసినట్లు నివేదికలు అందించారు. పంచాయతీరాజ్‌కి సంబంధించి మెటీరియల్ రూపంలో 13,01,20,884/- ఖర్చు చేసినట్లు తెలిపారు. రిజర్వ్ ఫారెస్టుకి సంబంధించి 8,96,155 ఖర్చు చేసియున్నందున సామాజిక తనిఖీ అధికారులు గత నెల 19 నుండి 08 తేదీ వరకు గ్రామాలలో తనిఖీ చేపట్టి గ్రామ సభలు నిర్వహించారని ఏపీవో అప్పలరాజు తెలిపారు. మండలంలోని కె.కోటపాడు, దాలివలస, గవర పాలెం గ్రామాలలో కూలీల మస్తర్లలో దిద్దుబాట్లు జరిగినట్లు గుర్తించారు. ఇటువంటి పొరపాట్లు మరల జరిగితే సహించేది లేదని ప్రిసైడింగ్ అధికారి రోజారాణి సిబ్బందిని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో యం.పి.పి రెడ్డి జగన్ మోహన్, ప్రిసైడింగ్ అధికారి, జిల్లా విజిలెన్స్ ఆఫీసర్ నిర్మలదేవి, యం.పి.డి.ఓ బి.వి.వి.పి పట్నాయక్, మాడుగుల క్లస్టర్ ఎ.పి.డి బి.శ్రీనివాస్, ఎ.పి.ఓ అప్పలరాజు, డి.ఆర్.డి.ఎ (డి.పి.యమ్) పెన్షన్స్ పి.వెంకటరమణ, ఇ.ఒ.పిఆర్ అండ్ ఆర్ డి ప్రసాద్, పి.ఆర్ ఎఇ బాలాజి అప్పారావు, సర్పంచ్‌లు, యం.పి.టి.సిలు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, ఉపాధి హామీ సిబ్బంది పాల్గొన్నారు.

నూతన గుంటపాలెంలో వరుసగా ఇళ్లల్లో చోరీ

ఒక ఇంట్లో బంగారం, నగదు అపహరణ

విశాలాంధ్ర - కశింకోట: మండలంలోని నూతన గుంటపాలెం పంచాయతీలో పలు నివాస గృహాల్లోకి తలుపులు బద్దలు కొట్టి గుర్తు తెలియని దుండగులు ఇళ్లల్లో చొరబడి చోరీకి పాల్పడ్డారు. ఈ సంఘటనకు సంబంధించి బాధితులు పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఎస్సీ కాలనీ చెందిన పిల్లి సుందర్‌రావు ఇంట్లో తలుపులు పగలగొట్టి దుండగులు లోపలి ప్రవేశించారని అన్నారు. తలువులు పగలగొట్టి బంగారు ఆభరణాన్ని, 12000 నగదు అపహరించుకుపోయారు. అదేవిధంగా కోరుకొండ మారయ్య, కలిగట్ల మహాలక్ష్మి నాయుడు, చిక్కాల రమణ, కళ్యం గౌరమ్మ వరలక్ష్మి, చిక్కాల రమణమ్మ, అగ్రహారం శ్రీనివాసరావు ఇళ్లల్లో కూడా చోరీ చేసేందుకు ఆయా నివాస గృహాలు తలుపులను పగలగొట్టి లోపల ఉన్న బట్టలను సిల్వర్ సామాగ్రిని చిందరవందర చేసారు. కాగా తమ ఇళ్లల్లో చోరీ జరిగిందని వీరంతా స్థానిక పోలీసులకు సమాచారం అందించారు. దీంతో సీఐ వినోద్ బాబు, ఎస్సై రమేష్ బాబు ఆధ్వర్యంలో సంఘటన స్థలానికి చేరుకొని సంఘటనకు సంబంధించి వివరాలను సేకరించారు. ఇది ఇలా ఉంటే చోరీ జరిగిన సుందర్‌రావు ఇంట్లో ఆ సమయంలో, ఇంటి దగ్గర లేమని, విశాఖపట్నం వెళ్ళామని తెలిపారు. మంగళవారం ఉదయం 9 గంటలకు ఇంటికి వచ్చి చూసేసరికి తలువులు పగల గొట్టి బెడ్ రూమ్‌లో ఉన్న బీరువా తాలాన్ని పగలగొట్టి తెరిచారు అన్నారు. బీరువాలో ఉన్న నగదు బంగారం పోయినట్లుగా పోలీసులకు ఆయన తెలియజేసారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అంగన్వాడీలకు కుళ్లిన కోడిగుడ్లు

- ఆందోళన చెందుతున్న గర్భిణీలు, బాలింతలు,

విశాలాంధ్ర - చోడవరం: అనకాపల్లి జిల్లా చోడవరం మండలంలోని గోవాడ అంగన్వాడీ కేంద్రం - 2లో పౌష్టికాహార పంపిణీలో భాగంగా మంగళవారం ఓ గర్భిణీకి అందజేసిన కోడి గుడ్లు కుళ్లిపోయి, దుర్వాసన రావడంతో లబ్ధిదారులు ఆందోళన చెందుతున్నారు. సమగ్ర మాతా శిశు సంరక్షణ పథకం కింద చక్కని ఆరోగ్యానికి పౌష్టికాహారం అందజేయాలనే ప్రభుత్వ కార్యక్రమానికి దిగువ స్థాయి అధికారులు, నిర్వాహకులు తూట్లు పొడుస్తున్నారు. రావికమతం ప్రాజెక్టు పరిధిలో అంగన్వాడీ కేంద్రాల్లో అందజేస్తున్న పౌష్టికాహారం సరఫరాలో అధికారులు, నిర్వాహకుల నిర్వాకం బయటపడింది. రక్తహీనత, ఎనీమియా తదితర విషవలయం నుండి మాతా శిశువులను కాపాడేందుకు, మాతా శిశు మరణాలు రేటు తగ్గించేందుకు చేస్తున్న ప్రభుత్వ ఆశయానికి పథకం నిర్వాహకులు తూట్లు పొడుస్తున్నారు. దీంతో అంగన్వాడీ కేంద్రాల్లో గర్భిణీలు, బాలింతలు, చిన్నారుల తల్లిదండ్రులు ఆందోళనలో పడ్డారు. తక్షణమే ఉన్నతాధికారులు స్పందించి, కుళ్లిన కోడిగుడ్లు సరఫరా చేసిన అంగన్వాడీ అధికారులు, నిర్వాహకుల పై ఉన్నతాధికారులు తగిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

ఉమ్మడి విశాఖలో రాగల ఐదు రోజుల్లో

తేలికపాటి వర్షాలు

విశాలాంధ్ర బ్యూరో - అనకాపల్లి: రాగల ఐదు రోజులలో విశాఖ, అనకాపల్లి జిల్లాలలో ఆకాశం మేఘావృతమై ఉండి తేలికపాటి నుండి ఒక మోస్తారు వర్షం పడే అవకాశం ఉందని, అలాగే ఉష్ణోగ్రతలు గరిష్టంగా 31.5 నుండి 33.3 డిగ్రీ సెల్సియస్ ఉండవచ్చని ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం అసోసియేట్ డైరెక్టర్ ఆఫ్ రీసెర్చ్ డా.సి.హెచ్.ముకుందరావు తెలిపారు. ప్రస్తుత వాతావరణ పరిస్థితులకు, చెరకు పైరులో మొవ్వ కుళ్ళు తెగులు ఆశించే అవకాశం ఉన్నందున కార్బెండిజిమ్ ఒక గ్రాము లేదా మాంకోజెబ్ 3 గ్రా. లీటరు నీటికి కలిపి తెగులు ఉధ్రితిని బట్టి 10-15 రోజుల వ్యవధిలో రెండు సార్లు పిచికారి చేసి నివారించవచ్చు అని తెలియజేసారు. 30 రోజులు దాటిన వర్షాధార చెఱకు లో ప్రస్తుత వాతావరణ పరిస్థితులకు పీక పురుగు ఆశించే అవకాశం ఉందని, నివారణకు మోనోక్రోటోఫాస్ ఏ 1.6 మీ.లీ. లేదా క్లోరాన్ట్రనిలిప్రోల్ ఏ 0.3 మీ.లీ. లీటరు నీటికి కలిపి పిచికారి చేసుకోవాలని తెలిపారు. రాగల వర్షాన్ని వినియోగించుకొని వరి పైరు విత్తుకొనే రైతులు ఆర్.జి.ఎల్. 2537, 2.2., 5204, 2.2 3. 3291, 2... 1262, 2... 1318, 1064, ... 1121, ఎం.టి.యు. 1224 వంటి రకాలను సేకరించి, మొలక శాతం చూసుకొని, ఎకరానికి 25-30 కిలోల విత్తనాన్ని 5 సెంట్ల నారుమడిలో సూడోమోనాస్ ఫ్లోరిసేన్స్ కిలో విత్తనానికి 10గ్రా. చప్పున కలిపి విత్తన శుద్ధి చేసి విత్తుకోవాలని సూచించారు. నేరుగా వరి విత్తే పద్ధతిలో కలుపు సమస్య అధికంగా ఉంటుంది కనుక, ఆలస్యంగా వేసిన వరిలో ప్రేటిలక్లోర్ కలుపు మందును ఎకరాకి 600 మీ.లీ. లేదా పెండిమితాలిన్ 38.7% సి.ఎస్. ఏ 700 మీ.లీ. చొప్పున వరి విత్తిన వెంటనే పిచికారి చేసుకోవాలని, అలాగే 20 రోజుల నేరుగా విత్తిన వరి పైరులో గడ్డి, వెడాల్పాటి కలుపు సమస్య ఉన్నప్పుడు, బిస్పైరిబాక్ సోడియం ఎకరాకు 100 మీ.లీ. ల చొప్పున పిచికారి చేయాలని, గడ్డి జాతి కలుపు ఎక్కువగా ఉన్నప్పుడు ఫెనోక్సాప్రోప్ పి ఇథైల్ ను 350 మీ.లీ. ల చొప్పున ఎకరా పొలంలో పిచికారి చేయాలని తెలిపారు. 25-30 రోజుల వయస్సు గల నేరుగా విత్తిన వరి పైరులో వర్షాల వలన కలుపు సమస్య పెరిగే అవకాశం ఉన్నందున 2,4-డి అమైన్ సాల్టు 58% ఇ.సి 2 మీ.లీ. మరియు 10 గ్రా. ల యూరియాను ఒక లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి లేదా ఆల్మిక్స్ కలుపు మందును ఎకరాకు 8 గ్రా. చొప్పున 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారి చేయాలని సూచించారు. ఈ సమావేశంలో డా.కె.వి.రమణ మూర్తి, డా.డి.ఆదిలక్ష్మి, డా.వి.గౌరి, డా.టి. శ్రీలత, డా. ఎం. విశాలాక్షి డా.వి.చంద్ర శేఖర్ మరియు డా.ఎ.అలివేణి పాల్గొన్నారు.

ఉచిత ఇసుక పాలసీ - రాష్ట్ర ప్రగతికి బాట

మాజీ ఎమ్మెల్సీ బుద్ధ నాగ జగదీష్

విశాలాంధ్ర బ్యూరో - అనకాపల్లి: ప్రభుత్వం ఉచిత ఇసుక పాలసీ తీసుకురావడం అభినందనీయమని ఏపీ ప్రభుత్వం తీసుకొచ్చిన ఉచిత ఇసుక విధానం వల్ల సామాన్యులకు భారీ ఊరట లభించిందని మాజీ శాసనమండలి సభ్యులు బుద్ద నాగ జగదీశ్వరరావు అన్నారు. బుధవారం పార్లమెంటరీ పార్టీ ఆఫీసులో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన హామీని చంద్రబాబు అధికారంలోకి వచ్చిన నెల రోజుల్లోపే అమలులోకి తీసుకురావడం దేశ చరిత్రలోనే ప్రప్రదమం అని, సాండ్ పాలసీ అమలు చేస్తూ జీవో నెంబర్ 43 విడుదల చేయడం బడుగు బలహీన వర్గాల అభివృద్ధికి రాష్ట్ర ప్రగతికి బాటలు వేస్తుందని నాణ్యమైన ఇసుక ప్రజలకు అందుబాటులో ఉండడమే తెలుగుదేశం విధానమని ఎంతో పారదర్శకతగా ముందుచూపుతో సాండ్ పాలసీని రూపొందించడం చంద్రబాబునాయుడుకే దక్కిందని అన్నారు. గత జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వం ఇసుక మాఫియాని నడిపించి ఒక్క ఇసుక కుంభకోణం ద్వారానే 50వేల కోట్లకు పైగా కొల్లగొట్టారని వైసీపీ నేతలు స్వయంగా ఇసుకాసుర అవతారం ఎత్తి దోచుకున్నారని నాగ జగదీష్ అన్నారు. పేదల ఇల్లు కట్టుకోవడానికి 5 లక్షల ఖర్చు అయితే అందులో ఇసుక కొనడానికి మూడు లక్షల ఖర్చు పెట్టాల్సిన పరిస్థితి ఉండేదని గృహ నిర్మాణ శాఖకు సరఫరాల పేరుతో 98 లక్షల టన్నుల ఇసుకను జగన్ అండ్ కో మింగేసారని నాగ జగదీష్ ఆవేదన వ్యక్తపరిచారు. జగన్ బినామీ సంస్థ జేపీ వెంచర్స్ కు చెల్లించాల్సిన మొత్తం నుంచి 800 కోట్లు ప్రజాధనాన్ని దారా దత్తం చేశారని వైసీపీ నేతలు మింగేసిన ఇసుకతో దాదాపు పది లక్షలకు పైగా ఇల్లు కట్టొచ్చంటే వారి అవినీతి ఏ స్థాయిలో అవినీతి చేశారో అర్థం చేసుకోవచ్చని జగదీష్ అన్నారు. అక్రమ ఇసుక తవ్వకాలను నిరోధిస్తూ రాష్ట్ర ప్రజల ప్రగతి దేయంగా ఈ పాలసీ రూపొందించడం మరియు దీనిపై నిరంతరం విజిలెన్స్ పర్యవేక్షణ ఉంటుందని సుప్రీంకోర్టు హైకోర్టు ఎన్జీటీ నిబంధనలకు అనుగుణంగా పర్యావరణ పరిరక్షణ దెబ్బతినకుండా ఉచిత ఇసుక చంద్రబాబునాయుడు అందిస్తారని జగదీష్ ఆశాభావం వ్యక్తపరిచారు. జిల్లాల స్థాయిలో సాండ్ కమిటీలు ఏర్పాటు చేసి కలెక్టర్, జాయింట్ కలెక్టర్, ఆర్డీవోలు, మైనింగ్ అధికారులు నిరంతర పర్యవేక్షణ ఉంటుందని జగదీష్ అన్నారు. సమావేశంలో జిల్లా కార్యదర్శి బోడి వెంకటరావు, పట్టణ ప్రధాన కార్యదర్శి కొట్నీ రామకృష్ణ దొర, జిల్లా కార్యదర్శి మళ్ల గణేష్, భవన నిర్మాణ కార్మికుల గౌరవ అధ్యక్షుడు సాలపు నాయుడు, 83వ డివిజన్ కార్యదర్శి మల్ల శివన్నారాయణ, తెలుగు యువత నాయకులు పిల్లా తారకేష్, తదితరులు పాల్గొన్నారు.

గిరి ప్రదక్షిణ ఏర్పాట్లు

పక్కాగా ఉండాలి

విశాఖ జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్

విశాలాంధ్ర - విశాఖ కలెక్టరేట్: శ్రీ వరాహ లక్ష్మీనరసింహ స్వామి దేవస్థానం ఆధ్వర్యంలో ఈనెల 20వ తేదీన నిర్వహించే సింహాచలం గిరి ప్రదక్షిణ ఏర్పాట్లు పక్కాగా ఉండాలని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ సంబంధిత అధికారులను ఆదేశించారు. గత అనుభవాలను దృష్టిలో ఉంచుకొని గిరి ప్రదక్షణలో పాల్గొనే భక్తులకు ఎటువంటి అసౌకర్యం తలెత్త కుండా చూడాలని సూచించారు. కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో భక్తుల గిరి ప్రదక్షిణ ఏర్పాట్లపై సమన్వయ అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈ నెల 20 తెల్లవారు జాము నుంచి 21 సాయంత్రం వరకు కొండదిగువ తొలిపావంచా వద్ద భక్తులను, ట్రాఫిక్ ను క్రమబద్దీకరణకు పోలీస్ బందోబస్తు, పోలీస్ శిబిరాలు, పబ్లిక్ అడ్రస్ సిస్టమ్ ఏర్పాటుచేయాలని పోలీస్ అధికారులను ఆదేశించారు. క్యూలైన్లు, రద్దీ ప్రదేశాలు వద్ద ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు, తోపులాటలు లేకుండా గట్టి బందోబస్తును ఏర్పాటుచేయాలని పోలీస్ అధికారులుకు సూచించారు.లక్షల సంఖ్యలో భక్తులు వచ్చే అవకాశం ఉన్నందున తాగునీరు, మరుగు దొడ్లు, పారిశుధ్యంతో పాటు రద్దీ ప్రదేశాల్లో లైటింగ్ ఏర్పాట్లు చేయాలని జీవీఎంసి అధికారులను ఆదేశించారు. ఆలయ ఈఓ సూచనల మేరకు అవసరమైన అంబులెన్సులు, వైద్య శిబిరాలు ఏర్పాటుచేయాలని, అలాగే ఓఆర్ఎస్ ప్యాకెట్లు, మందులతో పాటు ఒక వైద్యుడు, ఏఎన్ఎం లేదా ఆశా వర్కర్లను శిబిరాల వద్ద ఉంచాలని వైద్యాధికారులను కలెక్టర్ ఆదేశించారు. భక్తులు ప్రదక్షణ చేసే ప్రాంతాలతో పాటు రద్దీ ప్రాంతాల్లో నిరంతరాయంగా విద్యుత్ కొనసాగాలని, అవసరమైన జనరేటర్లను సిద్ధం చేసుకోవాలని ఈపిడిసిఎల్ అధికారులను ఆదేశించారు. అప్పుఘర్ వద్ద అధిక సంఖ్యలో భక్తులు స్నానాలు చేయు సమయంలో ఏ విధమైన నీటి ప్రమాదాలు జరగకుండా ఉండేందుకు మైక్ ద్వారా జాగ్రత్తలు చెప్పాలని, గజ ఈతగాళ్ళను అందుబాటులో ఉంచాలని మత్స్య శాఖ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. మద్యం సేవించే వారితో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఉండేందుకు ముందు జాగ్రత్త చర్యగా 20,21వ తేదీల్లో మద్యం షాపులను మూయించాలని ఎక్సయిజ్ డిపార్ట్మెంట్ అధికారులను ఆదేశించారు. భక్తుల సౌకర్యార్థం అవసరమైన బస్సులను నడపాలని ఆర్.టి.సి అధికారులను కోరారు. స్వామి వారి కొండపై అగ్ని మాపక యంత్రం, ఫైర్ ఎక్సంగ్విషర్స్ తో పాటు అదనపు సిబ్బందిని అందుబాటులో ఉండాలని తెలిపారు. గిరి ప్రదక్షణ కార్యక్రమంలో అందుబాటులో ఉన్న మరుగుదొడ్లతో పాటు రహదారిలో ఉండే పాఠశాలలు, కళ్యాణ మండపాల్లోని మరుగుదొడ్లను వినియోగించుటకు ఈఓ చేసిన ప్రతిపాదనను పరిశీలించి తెలియజేయాలని కలెక్టర్ ఈఓను సూచించారు. సమాచార శాఖ, పోలీస్ శాఖ సిబ్బంది కమాండ్ కంట్రోల్ వద్ద ఉండాలని, ఆర్.డి.ఓ పర్యవేక్షణ చేస్తారని చెప్పారు. అధికారులు అందరూ ఇంటి కార్యక్రమం లా భావించి, సమన్వయంతో పనిచేసి విజయవంతం కావాలని ఆకాంక్షించారు. ఈ సమావేశంలో జాయింట్ పోలీస్ కమిషనర్ ఫక్కీరప్ప, జీవీఎంసీ అదనపు కమిషనర్ కె. ఎస్. విశ్వనాథన్, జాయింట్ కలెక్టర్ కె. మయూర్ అశోక్, సింహాచలం దేవస్థానం ఆలయ ఈఓ ఎస్. శ్రీనివాసమూర్తి,, జిల్లా రెవిన్యూ అధికారి కె. మోహన్ కుమార్, ఆర్. డీ. ఓలు డి.హుస్సేన్ సాహెబ్, ఎస్.భాస్కర్ రెడ్డి, జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డా. పి.జగదీశ్వరరావు, ఈపిడిసిఎల్ ఎస్.ఈ మహేంద్రనాథ్, డిఐపిఆర్ఓ ఎస్. వి. రమణ, ఇతర జీవిఎంసీ, పోలీస్, జిల్లా అధికారులు, ఆలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

భారత క్రీడల్లో

63వ క్రీడగా యోగాకు గుర్తింపు

- హర్షం వ్యక్తం చేసిన యోగా గురువులు

విశాలాంధ్ర - చోడవరం: ప్రాచీన యోగాకు మంచి గుర్తింపు కల్పించిన భారత ప్రభుత్వం 2023 గుజరాత్‌లో జరిగిన జాతీయ క్రీడల్లో 2024 గోవాలో జరిగిన జాతీయ క్రీడల్లో అవకాశం కల్పించి యోగాని 63వ క్రీడగా గుర్తించడం పట్ల అనకాపల్లి జిల్లా యోగ అసోసియేషన్ అధ్యక్షుడు పుల్లేటి సతీష్, చోడవరం పతంజలి యోగ శిక్షణ సాధకులు హర్షం వ్యక్తం చేశారు. ప్రతి సంవత్సరం యోగ పోటీలు నిర్వహించడం జరుగుతుందన్నారు. అలాగే ఖేలో ఇండియా యూత్ గేమ్స్‌లో 2026లో జరగబోయే ఏషియన్ గేమ్స్‌లో కూడా యోగాకి అవకాశం కల్పించినట్లు భవిష్యత్తులో ఒలింపిక్స్‌లో కూడా యోగాని చూసే అవకాశం ఉంటుందని యోగాలో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులకు స్పోర్ట్స్ కోటా రిజర్వేషన్‌లో ఉద్యోగ అవకాశాలు ఉంటాయని భారత ఒలింపిక్స్ అసోసియేషన్ అధ్యక్షులు పిటి ఉష తెలియజేశారన్నారు. యోగాను విశ్వవ్యాప్తం చేసిన మన భారత ప్రధాని నరేంద్ర మోదీకు, ఇండియన్ ఒలంపిక్స్ అసోసియేషన్ అధ్యక్షురాలు పిటి ఉషకు యోగ క్రీడాకారులు తరఫున అభినందనలు తెలియజేసారు.

కూర్మావతారంలో శ్రీ జగన్నాథుడు

విశాలాంధ్ర - చోడవరం: స్థానిక భూదేవి శ్రీదేవి సమేత కేశవుని సన్నిధిలో ఉపాలయంగా కొలువు దీరిన బలభద్ర సుభద్ర సమేత జగన్నాథుడి దశావతారాల్లో భాగంగా బోళ్ళ వీధి రామాలయం వద్ద ఇంద్రజ్యుమ్నంలో మంగళవారం శ్రీ జగన్నాథ స్వామివారు కూర్మావతారంలో దర్శనమిచ్చారు. స్థానిక ఎమ్మెల్యే కె.ఎస్.ఎన్.రాజు, పలువురు ప్రముఖులు స్వామి, అమ్మవార్ల ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ప్రజలు, భక్తులు సందర్శనార్థం బోళ్ళవీధి రామాలయం వద్ద ఇంద్రాజ్యుమ్నంలో దశావతారాల్లో స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు, అర్చనలు నిర్వహిస్తున్నట్లు ప్రధాన అర్చకులు సుదర్శనం శాంతారామాచార్యులు, సీతారామాచార్యులు తెలియజేసారు.

సమాజానికి విద్యార్థులు కృషి ఎంతో ఉపయోగకరం

విశాలాంధ్ర - ఆనందపురం: ప్రస్తుతం సమాజంలో జరుగుతున్న పరిణామాలు దృష్ట్యా విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని ఆనందపురం ట్రాఫిక్ ఎస్ఐ పాపారావు తెలిపారు. మండలంలో స్థానిక జిల్లా పరిషత్ పాఠశాలలో విద్యార్థులకు మంగళవారం అవగాహన కార్యక్రమం కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మైనర్లు వాహనం నడపరాదని, చెడు వ్యసనాలకు , ముత్తు పదార్థాలు దూరంగా ఉండాలని , రేస్ డ్రైవింగ్ చేరాదని, విద్యార్థులు సమాజం కోసం పాటుపడి దేశం గర్వించదగ్గ స్థాయిలో ఉన్నత శిఖరాలకు ఎదగాలని తెలిపారు.